www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 మార్చి 2025
5
తూర్పుగోదావరి



ప్రజలకు మంత్రి దుర్గేష్ ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి కందుల దుర్గేష్ విశ్వావసు తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారికి ఉగాది పండుగ కొత్త సంవత్సరానికి నాంది పలికే రోజు అన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రజలందరికీ గొప్ప ప్రారంభం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ పి.ప్రశాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జిల్లా స్థాయి ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని, అందరూ హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఎస్‌పి డి.నరసింహ కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు పట్టని వ్యాపారులు

- అడ్డూ అదుపూ లేకుండా అమ్మకాలు
- మేకలు, గొర్రెలకు కానరాని వైద్య పరీక్షలు
- అస్తవ్యస్తంగా కబేళాల నిర్వహణ
- నామమాత్రంగానే అధికారుల తనిఖీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆదివారం వస్తే చాలు మాంసాహారం విక్రయించే దుకాణాలన్నీ కిటకిటలాడుతుంటాయి. అన్ని ప్రాంతాల్లోనూ లక్షల రూపాయల వ్యాపారం సాగుతుంది. ఇష్టమైన మాంసం తెచ్చుకుంటున్నాం. తింటున్నామని అనుకుంటున్నాం. కానీ అదెంత నాణ్యమైందో చూస్తున్నామా.? అది నిజంగా స్వచ్ఛమైందో లేదో సరి చూసుకుంటున్నారా? లేకపోతే ప్రమాదంలో పడినట్టే అంటున్నారు అధికారులు. ఎక్కడ చూసినా కల్తీ మాంస విక్రయం యథేచ్ఛగా సాగుతోంది. అనారోగ్యకర వాతావరణంలో పెరుగుతున్న కోళ్లు, మేకల్ని వధించి వాటినే అమ్ముతున్నారు. అవి కొని తెచ్చుకుని తిని అనేకమంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలోనూ నాసిరకం మాంసం, చికెన్, ఇతర నాన్ వెజ్ పదార్థాలు వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా మటన్ అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రభుత్వ అనుమతి పొందిన జంతు వధశాలల్లోనే మేకలు, గొర్రెలు తగిన జాగ్రత్తలతో వధించాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడంలేదు. అధికారుల నిర్లక్ష్యంతో కబేళాల నిర్వహణ అధ్వాన్నంగా మారిందని పలువురు వినియోగదారులు విమర్శిస్తున్నారు. తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన సిబ్బంది అటువైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది.

80 శాతం మంది నాన్ వెజ్ ప్రియులు

జిల్లాలో సుమారు 80 శాతం మంది ప్రజలు మాంసాహారాన్ని తింటున్నారు. ఇందులో ఎక్కువ మంది చికెన్, మటన్ తీసుకుంటారు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలు, తుని, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, మండపేట, రామచంద్రపురం, అమలాపురం పట్టణాలతో పాటు గొల్లప్రోలు, ఏలేశ్వరం, ముమ్మిడివరం నగర పంచాయతీలతో సహా అన్ని మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో 3 వేలు పైనే చికెన్, మటన్ షాపులున్నాయి. ప్రస్తుతం రహదారుల పక్కన, ప్రయివేటు ప్రదేశాల్లో నిర్వహిస్తున్న మాంసం దుకాణాల్లోనే జనం కొనుగోలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోనే యథేచ్ఛగా జంతువులను వధించి విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఇలా చేయడం చట్టరీత్యా నేరం.

నిబంధనలు పాటించని వైనం

నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ప్రతి మేక, గొర్రెకు వైద్య పరీక్షలు చేయాలి. అనారోగ్యంతో ఉన్న వాటిని కోసేందుకు అనుమతించకూడదు. ఆయా మేకలు, గొర్రెలు పూర్తి ఆరోగ్యంగా ఉంటేనే ఇవ్వాలి. కబేళా వద్ద తగినంత నీరు, పారిశుద్ధ్య పరిస్థితులను కల్పించాలి. కోసిన ప్రతి దానికి అధికారులు విధిగా ముద్ర వేయాలి. లేకుంటే మాంసం విక్రయించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాల్సి ఉంది. జంతువుల వధ తర్వాత వచ్చిన వ్యర్థాలను దూరంగా నిర్దేశించిన ప్రాంతంలో డంపింగ్ చేయాలి. కానీ చాలా చోట్ల మటన్ కబేళాలు అత్యంత దారుణంగా ఉంటున్నాయి. గొర్రెలు, మేకలకు పరీక్షలు చేసేందుకు పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవటంతో పలువురు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం తదితర పట్టణాలతో సహా అనేక ప్రాంతాల్లో వ్యాపారులు తమ దుకాణాల వద్దే జంతువులను వధించి వాటి వ్యర్థాలను అక్కడే ఉంచేస్తున్నారు. దీంతో కొన్ని గంటల తర్వాత తీవ్ర దుర్వాసన వచ్చి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో కబేళాలను ఆది, బుధవారాల్లో వెటర్నరీ డాక్టర్ వెళ్లి పరిశీలించాల్సి ఉంది. కానీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఒక వేళ వెళ్లినా తూతూ మంత్రంగానే పరిశీలన చేసి చేతులు దులుపుకొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆది, మంగళవారం ఎక్కువగా మాంసం విక్రయాలు జరుగుతాయి. కానీ వైద్య పరీక్షలు లేకుండానే నిబంధనలు పట్టించుకోకుండా అమ్మకాలు ఇష్టారీతిన సాగిపోతున్నాయి.

నిల్వ మాంసం విక్రయాలు.?

పశువైద్యులు, మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలో మాంసం విక్రయాలు జరగాల్సి ఉంది. మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా మాంసం మార్కెట్లు ఉండాలన్న నిబంధన అమలుకు నోచుకోవడంలేదు. ఎక్కడికక్కడ ఎక్కడబడితే అక్కడ దుకాణాలు వెలుస్తున్నాయి. అక్కడే వ్యాపారాలు జరిగిపోతున్నాయి. మరోవైపు పలుచోట్ల నిత్యం కలుషిత, నిల్వ మాంసం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. చనిపోయిన మేకలు, గొర్రెలను సైతం ఇక్కడే శుభ్రం చేసి అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అమ్ముడుపోగా మిగిలిన మాంసాన్ని నిల్వచేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇలా నిల్వచేసిన మాంసంలో బ్యాక్టీరియా వృద్ధి చెంది, మాంసం కుళ్లిపోయి ఆహారం కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాంసం విక్రయాలపై అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడడం ద్వారా ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలంతా కోరుతున్నారు.

బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు మంత్రి కార్యాలయంలో శనివారం మంత్రి దుర్గేష్ చేతుల 27 మంది బాధితులకు సిఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.29,50,639 విలువైన చెక్కులు స్వయంగా పంపిణీ చేశారు. పెరవలి, ఉసులుమర్రు, ఖండవల్లి, కానూరు, కానూరు అగ్రహారం గ్రామాలకు చెందిన పలువురు బాధితులు చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు 59 మంది బాధితులకు రూ.76 లక్షల చెక్కులు అందజేశామన్నారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు హార్ట్, కేన్సర్, కిడ్నీ ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సిఎంఆర్ఎఫ్ ఫండ్ నిధులు విడుదల, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్ఒసిలు అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం అని చెప్పారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని చెప్పారు. అనంతరం బాధిత లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

వసతి గృహాల్లో మౌలిక వసతుల ఏర్పాటు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికి సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక బాధ్యత వహించే విధానంలో భద్రత కోసం సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరం నాటికి ఆయా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, అందుకోసం నెలవారీ ప్రగతి నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిల విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం డిఎస్‌పి కోచింగ్‌పై కళాశాల స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. భూపతిరాజుపాలెం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఖాళీ స్థలంలో ఎస్‌సి లబ్ధిదారులకు చెట్ల పెంపకానికి, తద్వారా ఆదాయం సమకూర్చే క్రమంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడిబయట పిల్లలను గుర్తించి రాబోయే విద్యా సంవత్సరంలో తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లా విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. నియోజక వర్గాల పరిధిలో అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో తగిన భూములను గుర్తించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి హాస్టల్స్, వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య హేతుబద్ధత కలిగి ఉండేలా తక్కువ విద్యార్థులు ఉన్న వసతి గృహాలతో అనుసంధానం చేపట్టే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సామాజిక బాధ్యత కింద కంపెనీలు, వ్యక్తుల నుంచి సేకరించే నిధులతో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మరమ్మతులు చేపట్టి పూర్తి చెయ్యాలని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణ కోసం ఒకొక్క వసతి గృహానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించుకుని పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్.శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి.శశాంక పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన బాలికా చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా ఏడవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.బాబు మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో జరుగుతున్న దారుణాలు, అనేక కేసుల గురించి చిన్నారులకు విపులంగా వివరించారు. ఆడపిల్లలు ప్రలోభాలకు లోనుకాకుండా చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన ఉండాలని సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని వంగా హారిక ఉపన్యాసం పెద్దలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, పద్మజ, పద్మశ్రీ, నాగమణి, సువర్ణవేణి, హనుమంతరావు, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా పన్ను కౌంటర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లింపుదార్ల సౌకర్యార్థం 30, 31 సెలవు దినాలయినప్పటికీ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పన్ను వసూలు కౌంటర్లన్నీ పని చేస్తాయని కమిషనరు కేతన్ గార్గ్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని 14వ సచివాలయంలో ఏర్పాటు చేసిన పన్ను వసూలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగలు ఉన్నప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియుచున్నందున పన్ను వసూళ్ళకు ఆటంకం లేకుండా నగరపాలక సంస్థ కార్యాలయములోని ట్రెజరీ, నగరంలోని 7 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లతో పాటు హౌసింగ్ బోర్డులోని సచివాలయం-1 (పాత పంచాయితీ ఆఫీసు) కౌంటరు కూడా యథావిధిగా పని చేస్తాయని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ విషయాన్ని గమనించి తాము చెల్లించవలసిన పన్నులు పన్నేతరములు చెల్లించి నగరాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన అభిరామ్

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెందుర్తి అభిరామ్ మంత్రి నారా లోకేష్‌ను అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజానగరం నియోజకవర్గంలోని పలు ముఖ్యమైన సమస్యలతో పాటు పార్టీకి సంబంధించిన ఇతర వివరాలపై వారు చర్చించారు. ఈ సమావేశం రాజానగరం నియోజకవర్గ అభివద్ధికి సంబంధించిన సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకు వచ్చారు. పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

రూ.25 కోట్లతో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ పథకంలో రూ.25 కోట్లతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఆయా గ్రామాల్లో అత్యవసరమైన పనుల ప్రతిపాదనల జాబితాను శనివారం రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి అందజేశారు. పంచాయతీరాజ్ పరిధిలోని గ్రామీణ రోడ్లలో అధ్వానంగా ఉన్న వాటిని సిసి రోడ్లుగా అభివృద్ధి చేయడానికి అధికార యంత్రాంగంతో కలిసి తయారు చేసిన జాబితాపై ఎంఎల్ఎ కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రతిపాదనను త్వరితగతిన ఆమోదించి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంఎల్ఎ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంబంధిత పనుల వివరాలను కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. సిసి రోడ్ల నిర్మాణానికి సంబంధించి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గానికి సంబంధించి అత్యవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, పలు ప్రజా సమస్యలను ఎంఎల్ఎ బలరామకృష్ణ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి పథంలో నడిపించడానికి పూర్తి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులు కూడా త్వరితగతిన మంజూరయ్యేలా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను ఎంఎల్ఎ కోరారు.



కలెక్టర్ ప్రశాంతికి ప్రతిపాదనలు ఇస్తున్న ఎంఎల్ఎ

ఆశా డే రోజు కృతజ్ఞతా కార్యక్రమాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

ఆశా వర్కర్ల జీతాలు పెంచుతున్నామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఏప్రిల్ 1 న నిర్వహించే ఆశా డే సమావేశం సందర్భంగా ధన్యవాదాలు తెలిపేందుకు సిద్ధమవుతున్నట్టు ఎపి వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ తెలిపారు. నల్లజర్లలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆశాలు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ విషయాలను ప్రసాద్ వివరించారు. ఆశా వర్కర్లకు వేతనాన్ని పెంచాలని నిర్ణయించిన విషయాన్ని రాజ్యసభలో కేంద్రమంత్రి నడ్డా ప్రకటించడం ఆనందదాయకమన్నారు. భారతదేశ గ్రామీణ ఆరోగ్యసంరక్షణ వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తలు గుర్తింపు, గౌరవంతో పాటు మెరుగైన వేతనాల కోసం చాలాకాలంగా పోరాటాలు చేస్తున్నారన్నారు. అటువంటి పరిస్థితుల్లో కేంద్రమంత్రి చేసిన ప్రకటన ఆశాలకు ఎంతో ఊరట నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కంకిపాటి మరియమ్మ, షేక్ గాలిబీ, మన్నెం వెంకటరమణ, షేక్ ఫాతిమున్నిసా బేగం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

ప్రవీణ్ కుమార్ మరణంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - నిడదవోలు

పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మరణంపై పలు అనుమానాలు ఉన్న నేపథ్యంలో త్వరితగతిన దర్యాప్తు జరపాలని సమగ్ర విచారణ ద్వారా వాస్తవాలను తెలియజేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన అధ్యక్షతన పాస్టర్ ఫెలోషిప్ నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ కుమార్ మృతిపై అనేక సందేహాలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు.

కౌన్సిల్ సమావేశంలో అంశాల ఆమోదం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో అంశాలన్నీ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎన్‌టిఆర్ నగర్, ఇంద్రనగర్ నగర్, కోట సత్తెమ్మ దేవాలయం ప్రాంతాలకు సరైన అప్రోచ్ రోడ్లు లేనందున చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు వివిధ గ్రాంట్ నిధుల నుంచి మంజూరు కోసం కౌన్సిల్ ఆమోదానికి తీర్మానించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీను, కారింకి నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ కామిశెట్టి పుట్టినరోజు

ప్రజాశక్తి - నిడదవోలు

వైసిపి సీనియర్ నాయకులు 21వ వార్డ్ కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు గోపిరెడ్డి శ్రీను ఆలమూరు భారతి, కొత్తపల్లి సుప్రియ, బిర్రే పార్వతి, పిట్ట పద్మావతి, దిరిసిన రామచంద్రరావు, సయ్యద్ వల్లి, పట్టణంలో కిరణా మర్చంట్స్, వాసవి క్లబ్, వాకర్స్ క్లబ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కొండపాడులో మన ఇల్లు మన గౌరవం

ప్రజాశక్తి-చాగల్లు

మార్కొండపాడు గ్రామ పంచాయతీలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అధ్యక్షతన హౌసింగ్ లబ్ధిదారులతో శనివారం మన ఇల్లు మన గౌరవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఎఎఫ్ఎ కింద ఇచ్చిన సొమ్మును స్టేజ్ కన్వర్షన్ చేయించేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నన్నయలో పలువురికి ఉగాది పురస్కారాలు


ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉగాది పురస్కార వేడుకలు, ఆదర్శ విశ్వవిద్యాలయం - నూతన విద్యా విధానం అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విసి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ, నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ విసి ఆచార్య పి.జార్జ్ విక్టర్ హాజరై నన్నయ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి వెలిగించి చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విఇ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులందరికీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నన్నయ విశ్వవిద్యాలయాన్ని బొమ్మరిల్లు లాగా తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి, రూపశిల్పి, కృషీవలుడు ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జార్జ్ విక్టర్ వైస్ ఛాన్సలర్ గా కాకుండా సైట్ ఇంజనీర్ గా వర్క్ చేశారు చెప్పారు. వారు నాటిన మొక్కలు నేడు చెట్లుగా విశ్వవిద్యాలయ కుటుంబానికి నీడను ఇస్తున్నాయని అభినందించారు. తాను ఫిబ్రవరి 20న న బాధ్యతలు తీసుకున్నానని, నాటి నుండి విశ్వవిద్యాలయ అభివద్ధి కోసం కషి చేస్తున్నానని అన్నారు. విశ్వవిద్యాలయంలో ఆయా విభాగాల్లో చక్కని పనితీరు కనపరచిన సిబ్బందికి ఉగాది పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ అభివద్ధి కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య జార్జ్ విక్టర్ మాట్లాడుతూ ఆదర్శ విశ్వవిద్యాలయం - నూతన విద్యా విధానం పై ఆయన అనేక విషయాలను ప్రస్తావించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చెట్లు బెనారస్ యూనివర్సిటీ మోడల్ ఆధారంగా నాటామని, విశ్వవిద్యాలయంలో ప్రతి నిర్మాణం వెనుక చక్కని నేపథ్యం ఉందని గుర్తుచేశారు. తర్వాత విశ్వవిద్యాలయం తరపున ఆచార్య జార్జ్ విక్టర్, శిరోమణి దంపతులను సన్మానించి ఉగాది పురస్కార సన్మాన పత్ర జ్ఞాపికను అందజేసి అభినందించారు. అలాగే విశ్వవిద్యాలయంలో చక్కని పనితీరు కనపరచిన నాన్ టీచింగ్ సిబ్బందికి పురస్కారాలు అందించారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముందు విశ్వవిద్యాలయ చాళుక్య ద్వారం వద్ద నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



జార్జి విక్టర్‌ను సన్మానిస్తున్న విసి ఆచార్య ప్రసన్నశ్రీ

కార్టూ'నిజం'



ఘనంగా టిడిపి 43వ వార్షికోత్సవం

తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 సంవత్సరాలు అయిన సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల వేడుకలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

చాగల్లు మండలంలో పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాగల్లు మెయిన్ బజార్లో ఉన్న ఎన్టీఆర్ సెంటర్ వద్ద టిడిపి పట్టణ అధ్యక్షుడు దొంగ రామకష్ణ జెండా ఆవిష్కరించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు నాదల శ్రీరామ్ చౌదరి పూలమాల వేశారు. పార్టీ నాయకులు కరటూరు సతీష్, మాజీ ఎంపిపి కేతాసాహెబ్ మాజీ సర్పంచ్‌లు జొన్నకూటి వెంకయ్యమ్మ, ఊబా సావిత్రి బొల్లిన శివ నాగేంద్ర ఈడుపుగంటి సుబ్బారావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఎన్టీఆర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించారు. పేద ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేశారు. పలు గ్రామాలలో సర్పంచులు జెండాలు ఎగరేసి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వేలివెన్నులో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, పాలంగిలో ఈడుపుగంటి ఉదయ్ కుమార్, సూర్యారావుపాలెంలో సర్పంచ్ మెండే లలిత కుమారి, ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్, మెండే శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో..

తాళ్లపూడి పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి, అభివృద్ధితోపాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలన్న ధ్యేయంతో ఆవిర్భవించిన పార్టీ తెలుగుదేశం అని పలువురు వక్తలు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వర రావు అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదేవరపేటలో కొటారు వెంకట్రావు, పెద్దేవంలో కోడి శంకరం, తాడిపూడిలో నామా కొండబాబు యూత్, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గృహ నిర్మాణాలు, విద్యుత్ సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - సీతానగరం

మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. స్వంత స్థలాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై సర్పంచ్ కోండ్రపు ముత్యాలు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో 665 మందికి సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఎప్పుడు మంజూరు చేస్తారని ఆయన ప్రశ్నించారు. దీనికి హౌసింగ్ ఎఇ నాగ చక్రం సమాధానమిస్తూ ఇంకా మంజూరు కాలేదని తెలిపారు. మునికూడలిలో 11 కెవి విద్యుత్ లైన్ ఇళ్లపై నుంచి వెళ్తున్న సమస్యను కూడా ముత్యాలు లేవనెత్తారు. విద్యుత్ శాఖ ఎఇ చంద్రమోహన్ స్పందిస్తూ, విద్యుత్ లైన్ వేసిన తర్వాత ఇళ్లు నిర్మించారని, నిధులు మంజూరైన తర్వాతే వాటిని తొలగిస్తామని తెలిపారు. ఎఇఒ కె.స్వామినాయక్, ఎంపిడిఒ ఎం.భారతి, జెడ్‌పిటిసి చల్లమళ్ల వెంకటలక్ష్మి, కోండ్రపు ముత్యాలు, వైస్ ఎంపిపి-2 సత్యం మదన్ మోహన్ బాబు, ఇఒపిఆర్‌డి కెవిఎస్ఎస్ మూర్తి, ఎఒ సుబ్రహ్మణ్యం, గోపాల్, సతీష్, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎకె.మల్లవరం గ్రామానికి చెందిన గుతుర్తి అప్పారావు(68) శుక్రవారం ఉదయం కల్లు గీసేందుకు వెళ్తున్న క్రమంలో ద్విచక్రవాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బలమైన గాయాలపాలైన అప్పారావును పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆరోగ్యం విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని కుమారుడు సుబ్రమణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయినిపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

శనివారం సింగవరం గ్రామంలో ఉపాధ్యాయురాలిపై తల్లీకూతుళ్లు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సింగవరం ప్రాథమిక పాఠశాలలో కడలి నాగమణి కుమారి ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం సింగవరం గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు ఈలి నాగలక్ష్మి, ఈలి లావణ్య పాఠశాల ఆవరణలో ఉన్న మామిడి చెట్టు కాయలు కోశారు. ఈ విషయమై ఉపాధ్యాయురాలు నాగమణి కుమారి వారిని అడుగగా వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంలో తల్లీకూతుళ్లు ఇద్దరూ కలిసి ఉపాధ్యాయురాలిని విచక్షణా రహితంగా చేతులతో దాడి చేసి కొట్టారు. అనంతరం నువ్వు ఉద్యోగం ఎలా చేస్తావు అని ఉపాధ్యాయురాలిని భయభ్రాంతులకు గురి చేసి బెదిరించారని బాధితురాలు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు ప్రాథమిక విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పూజలు చేస్తుండగా మహిళకు గాయాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ బయట ప్రాంగణంలో పూజలు చేస్తుండగా ప్రమాదవశాత్తు మహిళకు చేతులకు నిప్పంటుకొని గాయాలయ్యాయి. వివరాలు ప్రకారం రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఎం.పద్మ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం వచ్చింది. దర్శన అనంతరం ఆలయ బయట ఉన్న దీపారాధన ప్రాంగణంలో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె చీర అంటుకుంది. ఈ ఘటనలో ఆమె చేతులకు, శరీరానికి గాయాలయ్యాయి. వెంటనే ఆమెను అందుబాటులో ఉన్న 104 సాయంతో ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ తరలించారు. బాధితురాలు పద్మను వాడపల్లి వెంకన్న ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు ఆలమూరు పిహెచ్‌సిలో పరామర్శించారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఈనెల 26వ తేదీన మూలపేటలో నిర్వహించిన పోలేరమ్మ జాతరలో జరిగిన అశ్లీల నృత్యాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. గ్రామదేవతల జాతర్లలో ఎవరైనా అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామదేవతల పేర్లు చెప్పి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువకులపై చాకుతో దాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలోని మావుళ్ళమ్మ జాతరలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనలో ఇద్దరు యువకులపై చాకుతో దాడి చేయగా ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కుంచె నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ శనివారం వివరాలు తెలిపారు. మావుళ్ళమ్మ జాతరలో ఎలిపే రాజేష్, ఎలిపే ఈశ్వర్, ఎలిపే సతీష్ తమపై చాకుతో దాడి చేసినట్లు కుంచె నాగబాబు ఫిర్యాదు చేశారన్నారు. ఈ దాడిలో కుంచే నాగబాబు, విజయ్‌కుమార్ అనే వ్యక్తికి గాయాలయ్యాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఆధ్వర్యంలో జరిగింది. టెక్నికల్ 3 సెషన్ ఛైర్‌పర్సన్‌గా పెరుమళ్ళపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవికె.మెహర్ వ్యవహరించి మాట్లాడారు. నానో మెటీరియల్స్ పర్యావరణ పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. వీటి తయారిలో నాణ్యత గల గ్రీన్ రసాయనాలు, సాంకేతికతను ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తాయన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కుమారి, నాగేంద్ర

పలువురికి దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కోరుకొండ మండలం గాడాల గ్రామంలో పలువురికి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. బొర్రా చిట్టెమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు కొల్లపు సుశీల, కడితి లక్ష్మి, మాతా రామలక్ష్మి, కొత్తపల్లి కుమారి ఆధ్వర్యాన అన్నదానం చేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. చిట్టెమ్మ సేవాకార్యక్రమాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోడె హిజ్కియ, కొల్లపు జక్కయ్య, కడితి రాధాకృష్ణ, మాతా రాజు, కొత్తపల్లి నాగేంద్రరావు, సుమ, వినీత, రాజేష్, చిట్టిబాబు, హనీ, మౌని పాల్గొన్నారు.

మిస్టరీ...హిస్టరీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

క్రైస్తవ మత ప్రచారకుడు ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతి యావత్ ప్రజానీకాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ప్రవీణ్ ఆంధ్ర రాష్ట్రమే కాకుండ దక్షిణాది రాష్ట్రాలకు సుపరిచితమే. ఆయన అనేక టీవీ చర్చా కార్యక్రమాలలో పాల్గొని తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పేవారు. ఈ విధంగా క్రైస్తవ సమాజంతో పాటు సామాన్యుల వీక్షకులలోనూ ఓ ప్రత్యేక స్థానాన్ని సముపార్జించారు. అటువంటి వ్యక్తి రాజమహేంద్రవరం హైవే సమీపంలో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించిన స్నేహితులు, బంధువులతో పాటు యావత్ క్రైస్తవ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతిని గురి చేసింది. తన ప్రాణానికి ముప్పు ఉందంటూ గత నెలలోనే స్వయంగా ప్రకటించడం, కొద్ది రోజులకే మృత్యువాత పడటం పలు సందేహాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆందోళనలు మిన్నంటాయి. పారదర్శకంగా పోలీసులు విచారణ చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమైంది. కొవ్వూరు వరకూ సిసి పుటేజీలను వెల్లడించిన పోలీసుశాఖ సమగ్ర దర్యాప్తునకు ఎవరి వద్ద అయినా తగిన సాక్షాధారాలు ఉంటే తెలియజేయాలని కోరటం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు పూర్తి స్థాయి విచారణ చేయక ముందే ఓ గుర్తు తెలియని కారు ఢీ కొట్టిందంటూ ప్రచారం ఊపందుకోవటం విమర్శలకు దారి తీసింది. అయితే ప్రవీణ్ శరీరంపై గాయాలు ఉన్నాయని స్నేహితులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తేల్చిచెబుతున్నారు. ప్రవీణ్ పార్థివ దేహం పోస్టు మార్టం, హైదరాబాద్ తరలింపు నేపథ్యంలోనే తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటువంటి సున్నితమైన అంశాన్ని ఎటువంటి అపోహలకు దారి తీయకుండా క్రైస్తవ సమాజానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఈ నేపథ్యంలో పోస్టు పార్టం రిపోర్టు ఆధారంగా ఓ నిర్ధారణకు వచ్చే అవకాశం ఉండటతో అందరి ఎదురు చూపులు పోస్టుమార్టం రిపోర్టు వైపే ఉన్నాయి. ఏదేమైనా ఇటువంటి ఘటనలపై పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంది.

ఫార్మా విద్యార్థి ఆత్మహత్య యత్నం

మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు ఫార్మా విద్యార్థి నాగాంజలి ఆత్మహత్యాయత్నం ఘటన దర్పనం పట్టింది. తాజా ఉదంతం యావత్ రాష్ట్ర ప్రజలను విషాదాన్ని నింపింది. నేటికీ ఆ యువతి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవటం బాధ్యతరాహిత్యాన్ని స్పష్టం చేస్తుంది. జిల్లాలో ప్రముఖ ఆస్పత్రులలో ఒకటైన కిమ్స్ బొల్లినేనిలో ఫార్మ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. అదే ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న దీపక్ అనే వ్యక్తి తనను శారీరకంగా, మానసికంగా వేధించటతో తట్టుకోలేని స్థితిలో తను ఈ నిర్ణయం తీసుకున్నానని, తన లాంటి దుస్థితి మరే అమ్మాయికి రాకూడదంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్ చదివిన వారందరికీ కంటతడి పెట్టించింది. ఈ నేపథ్యంలో విద్యార్థి, మహిళా సంఘాలు రోడ్డెక్కటంతో అధికార పార్టీ సైతం కదలిరాక తప్పలేదు. బాధిత యువతి విబి 10 ఎంజి తీసుకోవటంతో మునుపటిలా జీవించే అవాకాశం లేదని వైద్యులు తేల్చిచెబుతున్నారు. ఈ ఘటనలో ఆస్పత్రి యాజమాన్యం వ్యవహరించిన తీరు సర్వత్రా ఆందోళనకు గురి చేసింది. తొలి రోజు పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నా నిందితుని వివరాలను వెల్లడించకపోవటం, మరోవైపు ఘటన జరిగి రోజులు గడుస్తున్నా నాగాంజలి ఆరోగ్య స్థితిపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయకపోవటం విమర్శలకు దారి తీసింది. బాధితురాలి కుటుంబానికి భరోసా ఇవ్వాల్సిన మహిళా హోం మంత్రి కనీస చొరవ చూపించకపోవటం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని చాటిచెబుతోంది.

శివారు భూముల నీరు లేక రైతుల గగ్గోలు

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందనే సామెతలా ప్రస్తుత పరస్థితి ఉంది. గోదావరిలో పుష్కలంగా నీరు నిల్వలు ఉన్నప్పటికీ శివారు పంటలకు నీరు లభించటం లేదు. ధవళేశ్వరం బ్యారేజీ కట్టకముందు అతివృష్టి అనావృష్టి పరిస్థితులు ఉండేవి. బ్యారేజీ పూర్తయిన దశాబ్ధాల తర్వాత మళ్లీ ఈ దుస్థితి



తలెత్తింది. ఈ దుస్థితి కేవలం పాలక పక్షాల నిర్లక్ష్యమేనని సుస్పష్టమవుతోంది. ప్రతి ఏటా వేసవిలో వేసవి పనులతో పాటు కాల్వల ఆధునీకరణ కార్యక్రమాలను గత ప్రభుత్వం అటకెక్కించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ఈ పరస్థితిని అధిగమించటానికి తీసుకున్న చర్యలుశూన్యమనే అభిప్రాయం రైతులలో వ్యక్తమవుతోంది. వంతుల వారీ విధానం అమల్లో అనేక అవకతవకలు చోటు చేసుకోవటంతో ఇరిగేషన్ అధికారుల తీరుపైనా విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఎదుట రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

భానుని ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. జిల్లాలో సరాసరి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు చేరాయి. దీంతో మధ్యాహ్నం ప్రజలు బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రధాన కూడళ్లు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. అయితే చలివేంద్రాలు ఏర్పాటు చేయటంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు వెనుకపడ్డాయి. దీంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తత లేకపోవటంతో అక్కడక్కడా వడదెబ్బ మృతులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి ప్రజారోగ్యం కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలి.

వాడి వేడిగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీ వేడీగా సాగింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని 13వ అంశమైన మటన్‌చెరువు కాలువ పూడిక తీతకు నిధుల కేటాయింపుపై వైస్ ఛైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ అంశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, పితాని కృష్ణ ఆ అంశాన్ని వాయిదా వేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని కమిషనర్ పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు. వాద ప్రతి వాదనలు అనంతరం అజెండాలోని తమకు తెలియకుండా ప్రతిపాదించిన 2,13,14,21,27,30,32,33,35,37,38,39, 50 అంశాలను వాయిదా వేయాలని వైస్ ఛైర్మన్లు మోజెస్, గోకిన సునేత్రాదేవి, వైసిపి కౌన్సిలర్లు నేతల హరిబాబు, ఆవాలు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అంశాలను వాయిదా వేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ సమావేశాన్ని వాక్ అవుట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వారు కౌన్సిల్ బయట మీడియాతో మాట్లాడారు. కౌన్సిల్ సభ్యులు ప్రమేయం లేకుండా 55 అంశాలతో అజెండా ఏర్పాటు చేయడం దారుణమన్నారు. మురికివాడలను గాలికి వదిలేస్తున్నారని విమర్శంచారు. అధికార పార్టీ నాయకులతో అధికారులు కుమ్మక్కై వెనుకబడిన వార్డులకు అన్యాయం చేస్తున్నారని, తీరు మార్చుకోవాలని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ డిఇ, టిపిఒ, ఆర్ఒ, ప్రభుత్వ శాఖల అధికారులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

కౌన్సిలర్ల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ సర్వేల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేయడం తగదని పలువురు కౌన్సిలర్లు అన్నారు. శనివారం ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పి 4 సర్వే, బిసి కార్పొరేషన్ లబ్ధిదారుల గుర్తింపు, తదితర సర్వేల విషయంలో కౌన్సిలర్లను నిర్లక్ష్యం చేశారని అన్నారు. దీనివల్ల అర్హులైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి రూ.35 వేలు వసూలు చేశారని, అయితే కూటమి ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణానికి వారిని పరిగణలోకి తీసుకోకపోవడం అన్యాయన్నారు. కౌన్సిలర్ పప్పుల దుర్గారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, మున్సిపల్ డిఇఇ డిఎస్.ప్రకాశరావు, ఎఇ కృష్ణజీవప్రసాద్, టిపిఒ ఫణికుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విపత్తులపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒక పక్క భవనం కూలిపోయి కొంతమంది ప్రజలు దానిలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న ఎపి ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు ఘటన స్థలానికి చేరుకుని బాధితులను సురక్షితంగా బయటకు తీసి, గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. ఆ పక్కనే ఇంటికి నిప్పంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బంది హుటా హుటీన చేరుకుని మంటలను అదుపు చేయడమే కాకుండా మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించారు. వారికి ఆక్సిజన్ రక్షించారు. పక్కనే ఉన్న గోదావరిలో ఎవరో కొట్టుకుపోతున్నారంటూ సమాచారం రావడంతో ఎస్‌డిఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు స్పీడ్ బోట్, ఇతర పరికరాలతో గోదావరిలో కొట్టుకుపోతున్న ప్రజలను లైఫ్ జాకెట్లు, తాడు, గజ ఈతగాళ్ల స్పీడ్ బోట్ల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ఇదంతా ఓ సినిమా షూటింగ్ అనుకుంటే పొరపాటే. ఇదంతా విపత్తుల సంభవించినప్పుడు వివిధ శాఖల అధికార యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందో తెలియజేసేందుకు శనివారం మండలంలోని పిల్లంక పంచాయతీ కొత్తలంక వశిష్ట గోదావరి నది ఒడ్డున మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, సమగ్ర శిక్ష అభియాన్, నోడల్ అధికారి గోపాలరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మాక్ డ్రిల్‌ను విద్యార్థులు, గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ త్రినాథరావు, ఎపిపి రాయుడు సునీత, ఎంపిడిఒ కె.సత్యనారాయణ, మచ్చ శాఖ ఎడి లావణ్య, ఎఫ్‌డిఒ గోపి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - పిఠాపురం

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన జరిగింది. ఎపి పురపాలక చట్టం ప్రకారం కాంట్రాక్ట్ కమిటీ ఎన్నిక విషయంలో వైసిపి, టిడిపి కౌన్సిలర్లు మధ్య వాదోపవాదాలు జరిగాయి. కమిటీలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని టిడిపి కౌన్సిలర్ నగేష్ కోరగా పాత కమిటీనే కొనసాగించాలని వైసిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై మెజార్టీ తెలుసుకుందుకు వైసీపీ కౌన్సిలర్ లలిత ఓటింగ్‌కు వెళ్లాలన్నారు. దీంతో ఛైర్‌పర్సన్ ఓటింగ్ పెట్టారు. వైసిపి కౌన్సిలర్లు మెజార్టీ ద్వారా కాంట్రాక్ట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా రద్దు చేసింది. 22వ అంశాన్ని సరైన విధానంలో పొందుపరచకపోవడం తాము వ్యతిరేకిస్తున్నామని, అందులో పొందుపరచినా పనుల అన్నింటిని రద్దు చేయాలని, మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలని టిడిపి, జనసేనకు చెందిన 11 మంది కౌన్సిలర్లు కమిషనర్ కనకరావును కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పరదేశమ్మ జాతరలో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఇంజరం గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఆలయ కమిటి సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్ ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెంలో ఉన్న ఆదిత్య యూనివర్సిటీలో ఎచీవర్స్ డే వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదువుతూ వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలనే కృతనిశ్చయంతో మా సంపూర్ణంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 2700 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లితండ్రులు మాట్లాడారు.

యానాం వార్తలు

లోవరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - యానాం

వ్యవసాయ శాఖలో సీనియర్ అకౌంటు ఆఫీసర్‌గా లంక లోవరాజు అందించిన సేవలు అభినందనీయమని అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణ్యన్ కొనియాడారు. శనివారం స్థానిక అగ్రికల్చర్ కార్యాలయంలో లోవరాజు పదవీ విరమణ కార్యక్రమం జరిఇంది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ప్రజా పనులశాఖ ఇఇ చంద్రశేఖరన్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి తదితరులు లోవరాజు సేవలను అభినందించారు. ఈ సందర్భంగా లోవరాజు, ఆయన సతీమణి లక్ష్మీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లంక విద్యాసాగర్, లంకే వెంకటేశ్వరరావు, డేవిడ్‌రాజు, కాళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన నిరసన

ప్రజాశక్తి - యానాం

స్థానిక గోపాల్‌నగర్‌లో డంపింగ్ యార్డ్ పెట్టొద్దంటూ చేపట్టిన నిరసన శనివానికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి మద్దతు తెలిపారు. ప్రజలు గత 9 రోజులుగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఏమైపోయారని ప్రశ్నించ్చారు. డంపింగ్ యార్డ్ సమస్యపై ఎంపీ వైదిలింగంకు సమస్యను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడికొండల రాజాబాబు, విళ్ల చిన్ని, శ్రీమంతుల శ్రీధర్, చెక్కల అరుణ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

సిఐ, ఎస్ఐల బదిలీ

ప్రజాశక్తి - యానాం

యానాం సిఐ కె.షణ్ముగం, ఎస్ఐ మురుగానందమ్ పుదుచ్చేరికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. షణ్ముగంను ఎస్ఆర్ పుదుచ్చేరికి, మురుగానందమ్‌ను ఆర్యన్ కుప్పం ఎస్ఐగా బదిలీచేశారు. యానాం కొత్త సిఐగా ఎస్ ఆదలరసన్, ఎస్ఐగా ఇ.పుణీతరాజన్ నియమితులయ్యారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్థానిక ప్రభుత్వ ఐటిఐ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేలాయుధమ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యతోపాటు సామాజిక సేవాదృక్పధాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం ఐటిఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్, లంక ప్రసాదరావు పాల్గొన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - శంఖవరం

సత్యదేవ లైన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమనిక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రెసిడెన్సీలో లైన్స్ క్లబ్ నిర్వహించిన రజతోత్సవ వేడుక క్లబ్ అధ్యక్షుడు మచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెన్స్ క్లబ్ ద్వారా గత 25 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ పర్వత జానకి, ఎంపిపి పి.రాజబాబు, డిఇ.గుర్రాజు, క్లబ్బు ప్రతినిధులు కె.సత్యనారాయణ, అడపా సత్యనారాయణ, టి.రమేష్‌బాబు, పి.సూరిబాబు పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM

Engineering Section : e-Procurement Short Tender Notice

NIT No. 311 to 317/MCR/General/2024-25 **Dt: 29-03-2025**

Online tenders are invited from the eligible contractors on e-procurement for 07 works for with an Estimated Contract Value of **Rs. 44,85,634/-**

1. Tenders can be down loaded. The tender schedules for the above works will be available from 29-03-2025 at 9.00 P.M on wards. 2. Last date of time of receipt of tenders on or before dt. 07-04-2024 upto 2.00 PM.

3. Further details can be seen at 'e'-procurement website www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in

Sd/- **KETAN GARG,** I.A.S.,
COMMISSIONER
Municipal Corporation, Rajamahendravaram

CHANGE OF NAME

I, GURRAM GOPALAKRISHNA KUMAR, S/o. Subba Rao Gurram, D.No. 5-37, Main Road, Bendamurlanka, Dr. B.R.Ambedkar Konaseema Dist., Pin: 533210, Andhra Pradesh, India. I have changed my name from **KRISHNA KUMAR GURRAM** (Old Name) to **GURRAM GOPALA KRISHNA KUMAR** (New Name). Henceforth I am being called **GURRAM GOPALA KRISHNA KUMAR,** S/o. Subba Rao Gurram for all purposes.

పేరు మార్పు

యర్ర విజయలక్ష్మి, తండ్రి: నాగేశ్వరరావు, వయస్సు 27 సం॥లు, డో.నెం. 18-5-1/61, పెద్దాపురం పట్టణం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా, నేను పాస్‌పోర్టు కొరకు దరఖాస్తు చేసుకుంటున్నాను. కావున నా ఆధార్ కార్డులో యర్ర విజయలక్ష్మి అని నమోదు చేయబడినది. నా వివాహం అనంతరం బాసిన విజయలక్ష్మి, భర్త: బాసిన భాను అజయబాబు గా మార్చుకుంటున్నాను. నా పేరును బాసిన విజయలక్ష్మి గా చదువుకొనవలెను. ఈ అంశాలు అబద్దమని రుజువయితే మీరు తీసుకొనే చర్యలకు బాధ్యత వహించగలను.

బాసిన విజయలక్ష్మి
భర్త: బాసిన భాను అజయబాబు, టైలర్సు కాలనీ
డో.నెం. 18-5-1/61, పెద్దాపురం
సెల్: 7093042651

పాస్‌పోర్టు పోయినది

యడ్ల భరత్, S/o. అబ్బాయి, డో.నెం. 2-176, అంకంపాలెం గ్రామం, ఆత్రేయపురం మండలం చెందిన నేను విశాఖపట్నం పాస్‌పోర్టు అధారిటీ వారిచే 2012 సం॥లో జారీ చేయబడిన పాస్‌పోర్టు No. K 2756672, Expiry Date: 06-02-2022, Issue Date: 07-02-2012, ఈనెల ది. 12-03-2025 న మా ఇంటి నుండి అంకంపాలెం గ్రామంలో ఉన్న జిరాక్స్ షాపు వద్దకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో ఎక్కడో పోయినది. దొరికినవారు క్రింది అడ్రసుకు అందించగలరు.

చిరునామా: **యడ్ల భరత్, S/o. అబ్బాయి**
అంకంపాలెం పోస్టు, ఆత్రేయపురం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 9133098922

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. 849/2023, O.S. 13/2015

Between:

1) కరుటూరి రత్నకుమారి, వగైరా

మరియు

1) మద్దిపాటి సోమశేఖరరావు, వగైరా

5వ రెస్పాండెంట్:

శ్రీమతి చలపాటి గీత, W/o. పుష్కరరావు, వయస్సు 28 సం॥లు, రాగోలపల్లి గ్రామం, తాళ్ళపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు ఐ.ఎ పిటిషన్‌లో 5వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపించుచున్ననూ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసులు అమలు పరచుటకు ఉత్తర్వులు యిచ్చినందున పై కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున **ది. 02-04-2025వ తేదీ ఉదయం 10.00లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 02-04-2025

నీరుకొండ సూర్యనారాయణ
అడ్వకేట్, కొవ్వూరు
స్థలం: కొవ్వూరు
తేది: 28-3-2025
సెల్: 9440380773

సంక్షిప్త వార్తలు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి అన్నారు. శనివారం నాగులపల్లి పంచాయతీ పరిధిలో చేపట్టిన డ్రైనేజీల్లో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీల్లో చెత్త చెదారం పెరిగిపోవడంతో మురుగునీటి ప్రవాహం ఉండటం లేదన్నారు.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No.986 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri. K.Rama Krishna, ...Defendant

To
Sri. K.Rama Krishna, S/o. K.V.V.Raghava Rao, Aged about 50 years, Occ: Employee, R/o.D.No.70-17-126/2C, R.R. Nagar, Near RTO Office, Kakinada, Andhra pradesh-533005

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs 75,770-83 ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 27-06-2025.

In case of your failure to attend before the Court on 27-06-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2573 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri.A.V.Ramana, ...Defendant

To
Sri.A.V.Ramana, S/o. Appa Rao, Aged about 64 Years, Occ: Business, R/o. DR.46-17-20/1, Near Hdfc Bank, Danavaipet, Rajahmundary, A.P-533103.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,79,186-02ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 02-05-2025. In case of your failure to attend before the Court on 02-05-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No.5915 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri. Dadi Ganesh, ...Defendant

To
Sri. Dadi Ganesh, S/o.Manikyam, Aged about 35years, Occ: Civil Contractor, R/o.Pathagigala Padu, Kakinada, East Godavari Dist, Andhra Pradesh-533005

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs 1,52,410-22 ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 17-04-2025.

In case of your failure to attend before the Court on 17-04-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1741 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff

And

Sri.Naveen Manyam Defendant

To
Sri.Naveen Manyam, S/o.Narasimha Rao, Aged about 47 Years, Occ: Business, R/o. H.No.80-16-19, Flat No.201, Srivari Heights, Srinivas Nagar, S-N Road, Rajahmundry,A.P-533103.

.Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs 1,97,465-74ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 30-04-2025.

In case of your failure to attend before the Court on 30-04-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.